నూతన భవనాలకు మోక్షమెప్పుడో..

- శిథిలావస్థలో ఇరుకు గదుల మధ్య కొనసాగుతున్న పలు గ్రామాల పంచాయతీ కార్యాలయాలు
- కొన్నిచోట్ల అద్దె భవనాలే దిక్కు..
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు, సిబ్బంది

నాగారం : గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో అధికారులు, పాలకులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగారం మండలంలో మొత్తం 14 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో నాగారం, వర్ధమానుకోట, పసునూర్, పస్తాల, ఈటూరు, డి.కొత్తపల్లి, ఫణిగిరి, మామిడిపల్లి, మాచిరెడ్డిపల్లిలు పాత గ్రామపంచాయతీలు కాగా, మరో ఐదు నాగారంబంగ్లా, పేరబోయినగూడెం, నర్సింహులగూడెం, శాంతినగర్, లక్ష్మాపురం గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పాటైనాయి. పాత వాటిలో పసునూర్ జీపీ భవనం శిథిలావస్థకు చేరింది. కొత్తగా ఏర్పాటైన 5 జీపీలలో నాగారంబంగ్లా, లక్ష్మాపురం, పేరబోయినగూడెం జీపీలకు మాత్రమే నూతన భవనాలను నిర్మించారు. నర్సింహులగూడెం జీపీ భవనం ప్రభుత్వ భవనంలో కొనసాగుతుండగా, శాంతినగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతోంది. అలాగే మండలంలోని పలు జీపీలకు సొంత భవనాలు ఉన్నా అవి కూడా ఇరుకు గదులు ఉండటం, శిథిలావస్థకు చేరడంతో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన జీపీలతోపాటు శిథిలావస్థలలో, ఇరుకు గదుల మధ్య నడుస్తున్న జీపీలకు నూతన భవనాలు మంజూరు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పసునూర్‌లో శిథిలావస్థకు చేరిన జీపీ కార్యాలయం



శాంతినగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న జీపీ కార్యాలయం

పక్కా భవనం నిర్మించాలి

నూతనంగా ఏర్పాటయిన శాంతినగర్ గ్రామ పంచాయతీకి పక్కా భవనం నిర్మించాలి. జీపీ అద్దె భవనంలో కొనసాగుతుండటంతోపాటు ఇరుకు గది కావడంతో గ్రామ సభ నిర్వాహణ సమయంలో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నూతన జీపీలకు పక్కా భవనాలు మంజూరు చేయాలి.

– ఎస్‌కె.నాగుల్‌మీరా, మాజీ సర్పంచ్, శాంతినగర్

క్లుప్తంగా

కరాటే పోటీలలో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : ఆత్మ రక్షణ కోసం కరాటే అవసరమని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బి.లావణ్య అన్నారు. కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందిన పాఠశాల విద్యార్థులను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పాఠశాలలో సన్మానించి మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్ వరల్డ్ నాకాయామ చోటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నేషనల్ లెవల్ మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించగా అందులో తమ పాఠశాల విద్యార్థులు 6 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్, 1 బ్రాంజ్ మెడల్ సాధించారని ఆమె తెలిపారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతోపాటు కరాటే మాస్టర్ సంతోష్, పీఈటీ వెంకన్నలను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపు సీజ్

మద్దిరాల : మండల పరిధిలోని పిర్యానాయక్ తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను మంగళవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు. తండాకు చెందిన పలువురు వ్యక్తులు అక్రమంగా ఇసుకను తరలించి డంపులు చేస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా జరుగకుండా రోడ్లపై గాతులు

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఫిర్యాదులు అందుతుండడంతో మంగళవారం పోలీసులు ఇసుక రవాణా జరిగే దారుల్లో గాతులు తవ్వించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడారు. మండలంలో అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకొని ఇసుకను తరలించాలని, అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని తెలిపారు.

రేగటి సత్తమ్మ మృతికి ఎమ్మెల్యే సంతాపం



సత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని బండరామారం గ్రామానికి చెందిన రేగటి సత్తమ్మ ఇటీవల మృతి చెందింది. మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆమె దశ దినకర్మకు హాజర య్యారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, పులుసు ఉప్పలయ్య, అకారపు భాస్కర్, కొల్లూరి మహేందర్, ఉప్పలయ్య, వెంకన్న, రెగటి ఎల్లయ్య, ఉప్పుల ఎల్లయ్య పాల్గొన్నారు.

ఫెలోషిప్‌కు ఎంపికైన పెద నెమిల విద్యార్థి



నాగరాజు

నూతనకల్ : ఇటలీలోని ప్రతిష్టాత్మకమైన పరిశోధన ఫెలోషిప్‌కు మండల పరిధిలోని పెద నెమిల గ్రామానికి చెందిన గడ్డం నాగరాజు ఎంపికయ్యాడు. మేరీ క్యూరీ యాక్షన్స్ కోఫండ్ ఫెలోషిప్‌ని సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరోప్‌లో ఫ్యూచర్ డేటా ఎక్స్‌పర్ట్స్ ఫర్ యూరప్ కార్యక్రమంలో చేరుతున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

చిలుకూరు : మండల కేంద్రంలో కాలువ ఒడ్డున గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొల్లు సత్యనారాయణ లక్ష్మీ దంపతులు సహకరించగా, గ్రామానికి చెందిన ఆలస కాని శ్రీను, పద్మ దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రజినీకాంత్ ఆచార్యులు, ఆలయ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న భక్తులు

కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు



ఎమ్మెల్యే సామేల్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు



కల్యాణోత్సవానికి సిద్ధమవుతున్న స్టేజీ

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి స్వామి కల్యాణోత్సవం జరగనుంది. ఈ కల్యాణోత్సవానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, అర్వపల్లి ఎస్‌ఐ బాలకృష్ణలు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. డివిజన్ పరిధిలోని పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే మందుల సామేల్ ముఖ్య అతిథిగా హాజరై కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించనున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ చేయడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు, ఇతర భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం..

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి జరిగే కల్యాణోత్సవానికి హాజరుకావాలని కోరుతూ మంగళవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తలు, నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కల్యాణోత్సవానికి హాజరవుతానని ఎమ్మెల్యే తెలియజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, దాసరి సోమయ్య, బైరబోయిన మహరాజు, సైదులు, రామలింగయ్య, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, మాజీ సర్పంచ్ వీరస్వామి, ధర్మకర్తలు కృష్ణమూర్తి, అనిల్, నిమ్మల కుమార్, నాయకులు గుడిపల్లి వెంకట్‌రెడ్డి, వినయ్, విక్రమ్, కోటిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన అధ్యయనోత్సవాలు



స్వామివారిని గరుడ వాహనంపై, ఆళ్వార్లను పల్లకిలో ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు



గరుత్మంతుడిపై కొలువుదీరిన స్వామికి పూజలు చేస్తున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడు రోజులుగా జరుగుతున్న అధ్యయనోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లు కొలువుదీరగా పల్లకిలో ఆళ్వార్లను ఉంచి దేవాలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, బైరబోయిన మహరాజు, సైదులు, రామలింగయ్య, మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ధర్మకర్తలు అనిల్, నిమ్మల కుమార్, భక్తులు చెన్నా రమేష్, కొప్పోజు వెంకన్న, కోటిప్రసాద్, విక్రమ్, సంపత్, అర్చకులు పాల్గొన్నారు.

చంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి



డి.కొత్తపల్లిలో జెండా ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న నాయకులు

నాగారం : యానాల చంద్రారెడ్డి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. యానాల చంద్రారెడ్డి 42వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం డి.కొత్తపల్లి గ్రామ స్టేజీ సమీపంలో చంద్రారెడ్డి స్మారక స్థూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యానాల చంద్రారెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టి తుంగతుర్తి ప్రాంతంలో విప్లవ ఉద్యమాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు మాజీ సర్పంచ్ యానాల సుధాకర్‌రెడ్డి, హేమలత, నర్సింహారెడ్డి, పార్టీ నాయకులు బయ్యం లింగయ్య, సంపేట కృష్ణమూర్తి, కాసం వీరయ్య, లింగారెడ్డి, కళింగారెడ్డి, పల్లెర్ల సోమన్న, పడిశాల సోమలింగం, సంజీవ్, ఎస్‌డీ.బడేమియ, ఏశబోయిన లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి దంపతులు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని గోపాలపురంలో గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవం జరిపారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ గావించారు. ఈ మహోత్సవంలో హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్– లావణ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదులు, మాజీ ఎంపీటీసీ చీకూరి రాజారావు, కాల్వ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి చేయడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు

ఆత్మకూర్(ఎస్) : రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై మతం ముసుగులో కొందరు దుండగులు దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా పాస్టర్స్ పెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ దుర్గం ప్రభాకర్, సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ డా.జలగం జేమ్స్ తెలిపారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మత సామరస్యాన్ని కాపాడటంలో తెలంగాణ రాష్ట్రం ముందుందని అన్నారు. మతం పేరుతో దాడులకు పాల్పడే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సమావేశంలో పాస్టర్ రెవరెండ్ తాడంకి కిరణ్ బాబు, పాస్టర్స్ పెలోషిప్ గౌరవ సలహాదారుడు బొక్క ఏలియా రాజు, పెన్ పహాడ్ మండల అధ్యక్షుడు రెవ.జాన్ ప్రకాష్, రెవ.పీవీ బోయాజ్, రెవ.బానోత్ సుధాకర్, పాస్టర్స్ బొప్పాని అన్వేష్, పుల్లూరు మహేందర్, మల్లేపల్లి ప్రకాష్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వల అభివృద్ధికి కృషి



కాల్వ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నూతనకల్ : ఎస్సారెస్పీ కాల్వల అభివృద్ధికి ఎమ్మెల్యే సామేల్ కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 71 డీబీఎం పరిధిలోని ఆత్మకూర్(ఎస్) మండలం మంగళితండా గ్రామ శివారులోని ఎస్సారెస్పీ 19ఎల్ కాల్వ మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాల్ తండా, సోమ్లాతండా రైతులకు గోదావరి జలాలను అందించాలని కోరగా ఎమ్మెల్యే స్పందించి మరమ్మతు పనులు చేపట్టడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గుగులోతు కృష్ణ, గుగులోతు రాజునాయక్, బంటు బద్రి, కొరివి గంగయ్య, దేవరకొండ సాయి, మంగ్యానాయక్, గుగులోతు వీరన్న, పాతులోతు దామోదర్ నాయక్, అప్పానాయక్, పంతునాయక్, మాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం రోడ్డు బీటీ రెన్యువల్ పనులు పూర్తి

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలుకావడంతో ఆలయానికి భక్తుల రాక పెరిగింది. అయితే హైవే నుంచి దేవాలయం వరకు ఉన్న బీటీ రోడ్డు దెబ్బతిని గుంతలమయం కావడంతో రాకపోకలకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని దేవాదాయ పాలక వర్గం ఎమ్మెల్యే సామేల్ దృష్టికి తీసుకెళ్లడంతో సుమారు 200 మీటర్ల మేర బీటీ రెన్యూవల్ పనులను స్వచ్ఛందంగా జరిపించారు. మంగళవారం సాయంత్రంతో రెన్యూవల్ పనులు పూర్తయ్యాయి. బీటీ రెన్యువల్ పనులను జరిపించిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న దాతలు

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ముత్తయ్య అన్నారు. మంగళవారం ఎర్రపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు అశోక చక్రవర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్ రెడ్డి సహకారంతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్, సభ్యులు మూడ్ మోహన్‌నాయక్, మరికంటి అశోక్, వినోద్ నాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల



తిరుమలగిరి : పోలింగ్ కేంద్రాల ముసాయిదాను విడుదల చేస్తున్న సిబ్బంది



పెన్‌పహాడ్: పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల చేస్తున్న ఎంపీడీఓ సంజీవయ్య



మద్దిరాల : పోలింగ్ కేంద్రాల ముసాయిదాను ప్రదర్శిస్తున్న ఎంపీఓ ఇబ్రహీం, సిబ్బంది



అర్వపల్లి : పోలింగ్ కేంద్రాల ముసాయిదాను ప్రదర్శిస్తున్న అధికారులు



నాగారం : ఎంపీడీఓ కార్యాలయంలో ముసాయిదాను విడుదల చేస్తున్న సిబ్బంది

తిరుమలగిరి : త్వరలో జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వివరాలను మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తిరుమలగిరి మండలంలో 33 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 17,787 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో పురుషులు 8915, మహిళలు 8872 మంది ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టైపిస్టు రణధీర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ఎంపీడీఓ సంజీవయ్య మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలపై ఏమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 13వ తేదీ వరకు తెలియజేయాలని కోరారు. ఈ నెల 13న అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం నిర్వహించి, 15న తుదీ జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ సంపత్, టైపిస్టు మహేష్, కంప్యూటర్ ఆపరేటర్లు సైదయ్య, విష్ణు, శివ తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

మద్దిరాల : ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాలపై ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీఓ ఇబ్రహీం అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించి మాట్లాడారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13వ తేదీ వరకు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ టి. గోపి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఈ ఎన్నికలకు 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13 వరకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శిల్పిక, కార్యదర్శులు నవీన్‌రెడ్డి, రషీద్, సిబ్బంది సంతోష, నవీన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల ముసాయిదాను మంగళవారం స్థానిక ఎంపీడీఓ కె.మారయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 42 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 24,689 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈటూరు ఎంపీటీసీ స్థానం పరిధిలో 4060 ఓటర్లు, వర్ధమానుకోట–1 ఎంపీటీసీ పరిధిలో 2522, వర్ధమానుకోట–2 పరిధిలో 2159, ఫణిగిరి పరిధిలో –4817, నాగారం పరిధిలో 2937, డి.కొత్తపల్లి పరిధిలో–2687, పసునూర్ పరిధిలో 3077, పస్తాల ఎంపీటీసీ పరిధిలో 2430 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం. ముత్తయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురవయ్య స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మిద్దాం



నివాళులర్పిస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు, తదితరులు

పెన్‌పహాడ్ : గురవయ్య స్ఫూర్తితో ఉద్యమాలను నిర్మిద్దామని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నాగులపాటి అన్నారంలో ధనియాకుల గురవయ్య 25వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గురవయ్య తన జీవితాంతం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేశాడని అన్నారు. ఊరూరా ఎర్రజెండా ఎగరటంలో గురవయ్య పాత్ర మహోన్నతమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, మండల కమిటీ సభ్యుడు అయితబోయిన సత్యం, సీనియర్ జర్నలిస్టు ధనియాకుల వెంకటేశ్వర్లు, ఇరుగు రమేష్, నెమ్మాది పీరయ్య, నెమ్మాది లక్ష్మమ్మ, ధనియాకుల శ్రీను, బుచ్చిరాములు, ముత్తయ్య, రాములు, గోపాలదాస్ శ్రీరాములు, ముదిగొండ వీరస్వామి, మీసాల లచ్చయ్య, నకిరేకంటి నర్సయ్య, నాగరాజు, సత్యం, నాగార్జున, రామ్మూర్తి, శ్రీరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.15లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం



కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు

అర్వపల్లి : తిమ్మాపురంలో ఉపాధిహామీ పథకం నిధులు రూ. 15లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు 900మీటర్ల వరకు సీసీరోడ్లను నిర్మిస్తున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్ తెలిపారు. మంగళవారం వారు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బుడిగె వెంకన్న, గుడిపల్లి వెంకట్‌రెడ్డి, జీడి భాస్కర్, జానయ్య, బింగి బాలరాజు, జీడి రవి, వెంకన్న, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

చిలుకూరు : మండల కేంద్రంలో శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నడిగూడెం : నడిగూడెం మండల పరిధిలోని సిరిపురంలో ఉన్న శ్రీరంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ, అభిషేకాలు, శాంతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరి రమేష్, ఆలయ ప్రధాన అర్చకులు పల్లప్రోలు నర్సింహాచార్యులు, వేదాంతం చక్రధరాచార్యులు, రంగాచార్యులు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

నూతనకల్ : ఎమ్మెల్యే మందుల సామేల్‌పై కొంత మంది అగ్రకుల నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో ఎమ్మెల్యేకు ప్రజల్లో, కార్యకర్తల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని వారు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోనట్లయితే కార్యకర్తలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ప్రతి కార్యకర్తను పలకరించే వ్యక్తి సామేల్

తుంగతుర్తి : దళిత ఎమ్మెల్యే మందుల సామేల్‌పై అగ్రకుల నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని, ప్రతి కార్యకర్తను పలకరించే వ్యక్తి ఎమ్మెల్యే సామేల్ అని మార్కెట కమిటీ వైస్‌చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి నేటి వరకు కార్యకర్తలకు అండగా ఉంటూ, అభివృద్ధి పనులు చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మారగాని వెంకటయ్య, దాసరి శ్రీను, కలకోట్ల మల్లేష్, గుగులోతు రవి, బాలాజీ పాల్గొన్నారు.